క్లుప్తంగా

ముస్లింల శాంతి ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని టెక్కేమిట్టలో ముస్లింలు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహబూబియా మసీద్ నుంచి ప్రదర్శన చేపట్టారు. ఈనెల 13న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కాన్పూర్‌లో 'ఐ లవ్ మొహ్మద్' ప్లకార్డులు ప్రదర్శించారంటూ పోలీసులు 12 మంది ముస్లిం యువకులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ప్రదర్శన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అజ్మల్ హుస్సేన్, అల్తాఫ్, జిలానీ, ఖాదర్‌బాషా, గౌస్‌బాషా పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారి అరెస్ట్

నెల్లూరు సిటీ: రైసుమిల్లుల నుంచి బియ్యం తీసుకెళ్లి నగదు చెల్లించకపోవడంతో ఓ బియ్యం వ్యాపారిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వేణు సమాచారం మేరకు.. రూరల్ పరిధిలోని వి.వెంకటేశ్వర్లునాయుడు నుంచి బియ్యం కొనుగోలు చేసి తిరిగి నగదు చెల్లించకపోవడంపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విజయవాడకు చెందిన కె.వెంకట సత్యనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వలసలను ప్రోత్సహించిన మోదీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలోని జ్ఞాన సంపదను, మేధో శక్తిని విదేశాలకు వలసల రూపంలో దేశ ప్రధాని మోదీ ప్రోత్సహించారని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రూరల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలో ప్రణాళికా సంఘం, నీతి ఆయోగ్ వంటి వ్యవస్థలను మోదీ నీరుగార్చారన్నారు. సమావేశంలో అడ్వొకేట్ సుధీర్, నాయకులు మల్లికార్జునరెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాతల ఆందోళన



గొలగమూడిలో ధాన్యం తడవకుండా పట్టలు వేస్తున్న రైతులు

వెంకటాచలం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే దశలో నిత్యం వర్షాలు పడతుండటంతో వెంకటాచలం మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి, ఇస్కపాళెం, అనికేపల్లి, గొలగమూడి, పుంజులూరుపాడు తదితర గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో రెండో పంటను సాగు చేశారు. గొలగమూడి, అనికేపల్లి, ఇస్కపాళెం తదితర గ్రామాల్లో కోతలు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం నుంచి నిత్యం ఏదో సమయంలో వర్షం పడుతుండటంతో వీరు కలవరానికి గురవుతున్నారు. పంట నేలవాలిపోతుండటం, కోసిన ధాన్యం తడిసిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

కసుమూరులో భక్తుల ప్రార్థనలు



వెంకటాచలం: మండలంలోని కసుమూరులో గల మస్తాన్‌వలీ దర్గాను భక్తులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించుకున్నారు. గంధ మహోత్సవాలు శనివారంతో ముగిసినా, రద్దీ కొనసాగింది. మస్తాన్‌వలీ సమాధిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలను ముజావర్లు నిర్వహించారు.

ఘనంగా గురజాడ జయంతి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ మాట్లాడుతూ కన్యాశుల్కం, ముత్యాలసరాలు, దిద్దుబాటు తదితర రచనల ద్వారా గురజాడ సామాజిక చైతన్యం తీసుకొచ్చారన్నారు. గిడుగు రామ్మూర్తితో కలిసి వ్యవహారిక భాషోద్యమాన్ని ముందుండి నడిపిన వ్యక్తి గురజాడ అప్పారావు అని కొనియాడారు. నేటియువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లాడి నరసింహారావు, ఉపాధ్యాయుడు తాటిపర్తి వెంకటేశ్వర్లు, ఎర్రయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడవా? పెద్దాస్పత్రా!

- గతంలో వెంకటేశ్వరపురానికి చెందిన ఓ మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిని పాము కాటేసింది. దీంతో ఆమె రెండు రోజుల తర్వాత అప్పట్లో మృతిచెందింది.
- అలాగే మరో మహిళను రక్తపింజెరి పాము కాటేసింది. అదృష్టవశాత్తు ఆస్పత్రిలోనే చికిత్స పొంది ఆమె కోలుకుంది.
- ఓ సారి ఆర్థోపెడిక్ విభాగంలో కుర్చీకిందకు పాము చేరింది. ఉదయాన్నే గదిని శుభ్రం చేసే పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి చూసి ఆ పామును చంపేశారు.

- ఏపుగా పెరిగిపోవడంతో పాముల సంచారం
- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకునే వారేరీ?



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి భవనాల చుట్టూ ఏపుగా పెరిగిపోతున్న పిచ్చిమొక్కలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో భవనాలు, మెడికల్ కళాశాల చుట్టూ ఎక్కడికక్కడ గడ్డి, పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. దీంతో పిచ్చి మొక్కల్లో విష సర్పాలు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయని పారిశుద్ధ్య సిబ్బంది పేర్కొంటున్నారు.

పట్టించుకోని శానిటేషన్ కాంట్రాక్టర్

ఆస్పత్రి భవనాల చుట్టు విషసర్పాల సంచారం అధికంగా ఉన్నా శానిటేషన్ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. ఆయన ఎంఓయూ ప్రకారం ఎప్పటికప్పుడు మిషనరీతో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాల్సి ఉంది. అయితే అలా జరగకపోవడంతో ఆస్పత్రి భవనాల చుట్టు మోకాలి ఎత్తుకుపైగా పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి పరిసరాలు చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. నిత్యం 1000 నుంచి 1,400 మందికి పైగా రోగులు, వందలాది మంది డాక్టర్లు, సిబ్బంది, మెడికల్ విద్యార్థులు ఆ ప్రాంతంలో నడవాలంటేనే భయపడుతున్నారు. పెస్ట్ కాంట్రాక్టర్ పాములను, ఎలుకలను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇది కూడా ఆస్పత్రిలో జరగడం లేదు. అయినప్పటికీ శానిటేషన్ కాంట్రాక్టర్‌కు, పెస్ట్ కాంట్రాక్టర్‌కు 100 శాతం మార్కులు వేసి వారి బిల్లులు పాస్ అయ్యేదానికి అమ్యామ్యాలతో అధికారులు సహకరిస్తున్నారు. ఇప్పటికై నా రోగులు, శానిటేషన్ సిబ్బంది భద్రతా దృష్ట్యా భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించాలని రోగులు కోరుతున్నారు.





ఆస్పత్రి భవనాల పక్కన ఇదీ పరిస్థితి

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో వచ్చే నెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి అధ్యక్షతన విస్తృత సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయులకు సంబంధించి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ సభ్యుడు రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్‌అలీ, బాలత్రిపురసుందరి, జిల్లా బాధ్యులు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కోటేశ్వరరావు, మురళీకృష్ణ, కరీం మొహిద్దీన్, విజయభారతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట జిల్లా జాయింట్ సెక్రటరీ జగదీష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు డి.వంశీకృష్ణ, కోవూర్ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ నేత వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా(ఈఈ)గా పదోన్నతి లభించింది. దీంతో ముస్లిం మైనార్టీ ఎంప్లాయీస్ యూనియన్, ముస్లిం స్టూడెంట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, మౌలానా అబుల్ కలామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహకులు కోటమిట్ట సబ్‌స్టేషన్‌లో ఆయన్ను ఆదివారం సన్మానించారు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, అర్బన్ తహసీల్దార్ అబ్దుల్ హమీద్, ప్రైవేటు పాఠశాలల రాష్ట్ర నాయకుడు అన్వర్‌బాషా, అడ్వొకేట్ తాజుద్దీన్, ఇంజినీరింగ్ విభాగపు యూనియన్ నాయకులు ఖాదర్‌బాషా, నవాబ్‌జానీ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతోనే లక్ష్య సాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(బారకాసు): గిరిజన యువత ఆత్మ విశ్వాసంతో కష్టపడితే లక్ష్య సాధన సాధ్యమని ఫాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. గిరిపుత్ర ఫౌండేషన్, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి కల్పన అవకాశాలపై స్థానిక బీవీనగర్‌లోని గిరిజన భవన్‌లో అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని ఫాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ పాల్గొని, మాట్లాడారు. గిరిజన యువత పట్టుదలతో చదువుకోవాలని, వృత్తివిద్యలో నైపుణ్యం పెంచుకోవాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ నిర్వాహకులు స్రవంతి జయవర్దన్, పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నిరంగాల్లో గిరిజన యువత రాణించాలన్నారు. కార్యక్రమంలో యాకసిరి వెంకటేశ్వర్లు, బాపట్ల వేంకటపతి, పులి చెంచయ్య, వేటగిరి సుధాకర్‌రావు, ఈగ రామయ్య, ఎల్లంపల్లి కృష్ణకుమారి, చేవూరు శ్రీనివాసులు, గంధ్లళ శ్రీరాములు, మోపూరు వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య, జయభారతి హాస్పిటల్ జనరల్ మేనేజర్ మారెళ్ల గురుప్రసాద్ పాల్గొన్నారు.

శాంతి, సమానత్వంతోనే దేశాభివృద్ధి



శాంతికపోతాలను ఎగుర వేస్తున్న వాకర్స్ లాఫింగ్ క్లబ్ నాయకులు

నెల్లూరు (అర్బన్) : శాంతి, సహనత్వం వల్లనే ఏ దేశమైనా పురోగమిస్తుందని వాకర్స్ లాఫింగ్ క్లబ్ కార్యదర్శి, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా స్థానిక వీఆర్సీ గ్రౌండ్‌లో వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ఆదివారం శాంతిని కాంక్షిస్తూ పావురాలను వదిలారు. అనంతరం శాంతి, సౌభ్రాతృత్వం కోసం తమవంతు పాటు పడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే శాంతిని కాంక్షించే దేశాల్లో భారత్ మొదటి స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ కోశాధికారి జీఎన్ ప్రసాద్, వాకర్స్ రీజినల్ కౌన్సిలర్ ఎమ్వీరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, విజయకుమార్, రమణారెడ్డి, రవికుమార్, శివబాలసుబ్బారావు, యస్దాని, హరిప్రసాద్, తాజుద్దీన్, లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, వనిత వాకర్స్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై క్విజ్ పోటీలు



నెల్లూరు (టౌన్): స్థానిక చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని విశ్వసాయి స్కూల్‌లో బాలభవన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఆదివారం క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ నివారణ, వాయు కాలుష్యం తదితర వాటిని అరికట్టాలన్నారు. ఉపాధ్యాయులు శివశంకర్, ప్రియాంక, శ్వేతశ్రీ, లతాభవాని, లక్ష్మీభవాని పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

నెల్లూరు(అర్బన్): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు అన్నారు. జనతా ఫౌండేషన్ ఫౌండర్, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ రామారావు ప్రారంభించి, మాట్లాడారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానాన్ని కుటుంబ సాంప్రదాయంగా మార్చుకోవాలన్నారు. కాగా 60 మందికిపైగా ఫౌండేషన్ సభ్యులు, మిత్రులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేంద్ర, నరసింహ, కోటేశ్వరరావు, రాజా, మనోజ్, మురళి, అంకయ్య, భగవాన్‌రెడ్డి, శ్రీనాథ్, మాల్యాద్రి, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): జెండావీధి కోటమిట్టలో ఉన్న కంతర్షావలీ దర్గాలో గంధ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా సాహెబ్ ముస్తాఖ్ ఆధ్వర్యంలో గంధం సమర్పించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ అన్నదానం చేశారు. నిర్వాహకులు రసూల్, మజాహర్, జాకీర్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ స్తంభాలు







రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు



సైడు కాలువలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ పరిధిలో విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. సిమెంట్‌రోడ్డు మధ్యలో, సైడు కాలువల్లో విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కాలువల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వల్ల మురుగునీరు ప్రవహించక దుర్గంధాన్ని వెదజల్లుతూ, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. అదేవిధంగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికై నా 54వ డివిజన్ పరిధిలో సిమెంట్ రోడ్లు, సైడు కాలువల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను తీసి ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వివిధ రకాల పూజలు, అభిషేకాలు జరుగనున్నాయి.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): మెక్లిన్స్‌రోడ్డు విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నేటి నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగనున్నాయని దేవస్థానం శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చంగయ్య ఆచారి తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను ఆదివారం దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానం ప్రాంగణంలోని గాయత్రిదేవి, గోవిందమాంబవార్లకు శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అలిమేలి శ్రీహరిఆచారి, విగ్రహాల బాలకృష్ణాచారి, దండపాణి సురేష్‌ఆచారి, కందుకూరు జనార్ధన్‌ఆచారి, అలిమేలి సుబ్రహ్మణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనం సాగించాలి



మాట్లాడుతున్న షౌకత్ ఫహీమ్

నెల్లూరు(బృందావనం): మెక్లిన్స్‌రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్లో జమాఅతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఫ్యామిలీ కన్వెన్షన్' నిర్వహించారు. సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనాబ్ షౌకత్ ఫహీమ్ హాజరై, ఖురాన్ పఠనం చేశారు. ప్రతి ముస్లిం తన ఇంటిని విశ్వాసం, శాంతి, ప్రేమ, నీతి, నియమాలతో నింపి, ఆధ్యాత్మిక జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ నగరాధ్యక్షుడు జనాబ్ సయ్యద్ నవీన్ అహ్మద్, జిల్లా ఆర్గనైజర్ ఇస్మాయిల్, జిల్లా ఆర్గనైజర్ ఇంతియాజ్, మజ్హర్, హమీద్ అహ్మద్, అన్వర్‌బేగ్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని మురుగునీటి ప్రవాహం



మురుగునీటిలో ప్రయాణిస్తున్న వాహనదారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి కింద డ్రెయినేజీ నీరు పొర్లి రోడ్డుపై ప్రవహిస్తోంది. ప్రతిరోజు ఉదయం వేళల్లో డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో కూడిన మురుగునీటిలో ప్రయాణించలేక నగర ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్న ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఇలాంటి పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.